

# 22
# సలీం సుందర్ ప్రేమకథ

ఆర్ట్స్ కాలేజీ గేటు ముందర నిలబడ్డాడు సలీం సుందర్. రోడ్డుపై సన్నని తుంపర. ఉదయం నుంచి వాన కురుస్తూనే ఉంది. నది మధ్యన నావలాగా బస్సు ఒకటి నీళ్ళను చీల్చుకొంటూ- గొడుగులతో, రెయిన్‌కోట్లతో బస్సుల్లోంచి దిగుతూ- పైనుండి పెద్దగా ఉరుముతూ వానమబ్బులు.

ఆకుపచ్చ రెయిన్‌కోట్ వేసుకొన్న అమ్మాయి కోసం ఎదురు చూస్తున్నాడు సలీం. ఆకుపచ్చ రెయిన్‌కోట్ అమ్మాయి, మనోరమ. ఇట్లా మనోరమ కోసం ఎదురుచూడటం, అదీ వానచినుకుల మధ్య, ఎంతో ఇష్టమైన విషయాలు సలీంకు. ఇవాళ మాత్రం వానచినుకు స్పర్శ ఏ ఆనందాన్ని ఇవ్వడం లేదు. ఆందోళన, దిగులు, అర్థంకాని ఏదో భయం .

పదకొండు నెలల ఉద్యోగం ఈరోజు ఉదయంతో ముగిసింది. పొద్దున్నే ఆఫీసు ముందు లాకౌట్ బోర్డు కనిపించింది. పత్రిక మూసేస్తున్నాం అన్నారు. హతాశుడయ్యాడు సలీం. ఆగిపోతుందనే పుకారు ఉంది కానీ ఇంత హఠాత్తుగా- 'పత్రికను చంపేశారు,' అంటూ ఒక వృద్ధ జర్నలిస్టు గొల్లుమన్నాడు. ఆఫీసు గేటు బయట, సంతాప సభలా ఉంది. ఒక మరణం కాదు, వందలాది మరణాలకు

సరిపడ్డ సంతాపం. ఆ గుంపును తప్పించుకొని, ఇట్లా యూనివర్శిటీ వైపు- ఆర్ట్స్ కాలేజీ ముందు నిలబడి, మనోరమ కోసం ఎదురుచూస్తున్నాడు. సిగరెట్టు వెలిగించుకొని కారిడార్ పొడవున కలదిరిగాడు. ఆవైపు కారిడార్‌లో ఎక్కడో ఆకుపచ్చరంగు తళుక్కుమని, "మనో..." అని పెద్దగా అరిచాడు. టెరస్‌పై నుంచి జారే వాన చప్పుడులో ఆ అరుపు కలిసిపోయింది. ఆ ఆకుపచ్చరంగు రెయిన్‌కోట్ అమ్మాయి మనోరమ అయి ఉండక పోవచ్చు. కానీ ఆకుపచ్చరంగు రెయిన్‌కోట్ మనోరమకు సింబాలిక్‌గా గుర్తుంచుకోవటం యిష్టం సలీంకి. దూరంగా క్లాస్‌రూమ్ బయట మరోసారి తళుక్కుమంది ఆకుపచ్చరంగు.

వాన తుంపర, నదిలాంటి రోడ్డు- నిర్వ్యాణమూర్తిలా ఉన్న యూనివర్శిటీ భవనం- ఒకానొక ఆకుపచ్చని రెయిన్‌కోటు అమ్మాయి కోసం- చాలాకాలంగా ఎదురుచూస్తున్న వాడిలా- పదకొండు నెలల క్రిందటి దృశ్యం హఠాత్తుగా గుర్తుకొచ్చింది.

హోటల్ సర్వర్, స్టేషన్‌లో పోర్టర్- దేనికైనా సిద్ధం అనుకొన్న సమయంలో ఈ పత్రికలో ఉద్యోగం వచ్చింది. చాన్నాళ్ళ క్రితం ఎప్పుడో రాసిన కవితల్ని పట్టుకొని, అమాయకమైన నాలుగైదు వాక్యాల్ని, కవితలుగా గుర్తించిన ఎడిటర్ని చూడాలని పత్రికాఫీసు కెళితే, అనుకోకుండా ఆ ఉద్యోగం కాలికి తగిలింది. హైదరాబాద్ గురించి నాలుగు వాక్యాలు రాయమన్నాడు ఎడిటర్. "బస్సులు, రోడ్లు, జీవితంలోని వందల గంటలు రోడ్డుపైనే గడవటం, హైదరాబాద్ నిర్వ్యాణమూర్తి. రౌడీషీటర్. చాచి ముఖంపై కొట్టిన ఫెమినిస్టు కవిత. ఆకాశంవైపు నిలబడి మాస్టర్బేట్ చేసుకొంటున్న బాచిలర్ కవి. ఇదీ హైదరాబాద్. రోడ్లు రోడ్లుగా చీల్చబడ్డ మాంసపు ముద్ద," ఆ నాలుగు వాక్యాలు చూస్తూనే ఉద్యోగం ఖాయం చేశాడాయన.

పత్రికా ప్రపంచం వింత వాతావరణం. అక్కడ కథలకీ, కవిత్వానికీ, కబుర్లకీ, మీటింగ్‌లకూ, ఆవిష్కరణ సభలకూ గొప్ప గిరాకీ. ఒక కవిత రాసి, కొద్దిగా చిరుగెడ్డం పెంచి, భుజానికో సంచి తగిలించుకొని, సంచిలో నాలుగైదు రకాల ఉద్యమాల కరపత్రాలు వేసుకొని తిరగటం ఒక ఫ్యాషన్.

రెండోరోజు కాంటీన్‌లో, "ఇక్కడ కులాలతో లేదా మతాలతోనే పరిచయం మొదలుపెట్టుకొంటాం! ఇది పోస్ట్ మోడరన్ సంప్రదాయం," అంటూ, "ఆ సలీం సుందర్ పేరేమిటి?" అన్నారు నొసలు చిట్లిస్తూ.

"ఊళ్ళో గొడవలు, సాయిబుల ఇళ్ళన్నీ కబ్జాభూములని, ఇళ్ళన్నీ పడగొట్టాలనీ- నా పై అరెస్టు వారెంటు ఉంది. మర్డర్ కేసులో ఇరికించారు. నేనూ, అమ్మీ ఇద్దరమే, ఇట్లా పారిపోయి వచ్చి- అమ్మీకి అర్థంకాని జబ్బు, ఏదీ గుర్తు రాదు. మనుషుల్ని పోలిక పట్టలేదు. ఆకలనీ, అన్నం కలుపుకు తినాలనీ కూడా తెలియదు."

టీ తాగుతూ, ఒకే సిగరెట్టును నలుగురు పంచుకొంటూ, ఎవరి చెవుల్లోకీ ఎక్క లేదు ఆ కథ. 'ఇట్లాంటి కథలు చాలా విన్నాం,' అన్నట్లుగా చూసి, "కొంచెం వయొలెన్స్, ఫైటింగ్ తెలిసిన కవివన్న మాట. ఏదో ఒక సాహిత్యసభలో మాకు పనికి వస్తావు," అంటూ గంభీరంగా చెప్పారు.

ట్రాన్స్‌లో ఉన్న సలీం భుజంపై వెచ్చగా చెయ్యి పడింది. మనోరమ. ఆరవేసు కొంటున్నట్లుగా ఆకుపచ్చరంగు రెయిన్‌కోట్ భుజాలకు తగిలించుకొని, "పద కాంటీన్‌కు వెళదాం," అంటూ ముందుకు నడిచింది. ఆమె రెయిన్‌కోట్ అందుకొని, విదిలించి భుజంపై వేసుకొన్నాడు. మనోరమ చేతుల నిండా పుస్తకాలు. రెండు కప్పుల టీ తెచ్చుకొని ఒక మూలన కుర్చీల్లో కూలబడ్డారు. ఇంకో మూలన ఒక ముసలి ప్రొఫెసరు, వానలోకి సిగిరెట్టు పొగ వదులుతూ పెద్దపెద్దగా ఇంగ్లీషు పొయిట్రీ చదువుతున్నాడు. మనోరమ టీ చప్పరిస్తుంది. ఆమె శరీరంలోంచి వచ్చే పెర్‌ఫ్యూమ్ వాసన సన్నటి తెరలా అతని ముక్కుకు తాకుతుంది. ఆ పరిమళానికి తోడు సన్నని వాన తుంపర గోడపైన పడి, తడిసిన మట్టివాసన కూడా.

"కొత్త పోయమ్స్ ఏమైనా రాశావా?" అంది మనోరమ ఉపోద్ఘాతంలా- సిగరెట్టు వెలిగించుకొని, వాళ్ళ మధ్యనున్న నిశ్శబ్దంలోకి పొగను మెల్లమెల్లగా వదలసాగాడు సలీం. హఠాత్తుగా గొంతు సర్దుకొని, "ఉద్యోగం పోయింది," అన్నాడు దిగులుగా. అదేమంత సీరియస్ విషయం కాదన్నట్టుగా అతని చేతిని మృదువుగా నొక్కింది. గొప్ప ఆశను నింపే దయగల చూపుతో అతని వైపు చూడసాగింది. చాలాసేపు నిశ్శబ్దం. వాన చినుకుల సన్నని గుసగుస. వాన ఎదురుగా నిలబడి పొయిట్రీ రిసైట్ చేస్తున్న ప్రొఫెసరు, దూరంగా ఎక్కడి నుంచో నవ్వుల గలగలలు, లేళ్ళు పరిగెత్తుతున్నట్లుగా- మనోరమ టీ తాగటం ఆపివేసి, సన్నగా ఈల వేయటం మొదలుపెట్టింది. మనోరమతో పరిచయం ఎట్లా జరిగింది అంటూ ఒక జ్ఞాపకంలోకి వెళ్ళాడు సలీం.

మొదటిసారి ఒక సాహిత్యసభలో కలిసింది. కల్చర్ గురించి, డయెలెక్ట్ గురించి, అర్థంకాని చాలా విషయాల గురించి మాట్లాడుతూనే ఉంది. వారం కాకుండానే మనోరమ దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. సలీం కవిత్వాన్ని మెచ్చుకొంటూ, ఆ ఉత్తరానికి అబగా సమాధానం రాసి, పదో ఇరవయ్యో ఉత్తరాలు వరుసగా వాటిపైన నెంబర్లు వేసుకొని- ఉత్తరాల్లోంచి పరిమళభరితమైన ఒక స్నేహం వాళ్ళిద్దరిని దగ్గరకు చేర్చింది.

వాన తగ్గే సూచనలేవీ కనబడటం లేదు. ముసలి ప్రొఫెసరు పొయిట్రీ రిసైటేషన్ ఎందుకో ఆగిపోయింది. కాంటీన్ బయట చప్పుడు. ఇద్దరు పోలీసులు ఇనుపబూట్లు చప్పుడు చేసుకొంటూ లోపలికి వచ్చారు. లోపల ఉన్న మనుషులవైపు పరిశీలనగా చూశారు. కాంటీన్‌వాడు వాళ్ళకు రెండు కప్పుల్లో టీ ఇచ్చాడు. పోలీసుల రాకతో

వాతావరణం బిగుసుకుపోయినట్లు అయింది. "స్టూడెంట్ యూనియన్ లీడర్ని, వేకువజామున ఇంజనీరింగ్ కాలేజీ గేటు దగ్గర పొడిచి చంపేశారట. పొద్దుట్నుంచి హాస్టలు, క్లాస్‌రూములు ఇట్లా పోలీసుల కూంబింగ్‌కు గురైనాయి," మనోరమ ముఖం లోని ప్రశాంతత క్రమంగా విసుగ్గా, అసహనంగా మారిపోయింది. చేతిలోని టీ కప్పు ఎందుకో వణికింది.

ముసలి ప్రొఫెసరు మౌనంగా ఒక మూలకు వెళ్ళి కూర్చున్నాడు. నిశ్శబ్దంగా వుంది కాంటీన్. వాన చప్పుడు ఒకటే రిథమిక్‌గా, నిరంతరంగా కొనసాగుతోంది. వానజల్లును, చినుకుల శబ్దాల్ని వింటూ మౌనం నటిస్తున్నారు వాళ్ళిద్దరూ. ఒక సాయంకాలం, చీకటి ఆసరాగా పారాపెట్ పక్కన మనోరమను ముద్దుపెట్టుకొన్న ముచ్చటని గుర్తు చేసు కొన్నాడు, సలీం. కాంటీన్ కిటికీలోంచి ఆ పారాపెట్ స్పష్టంగా కనిపిస్తోంది. కొంచెం సిగ్గు, దొంగ కోపం, ఎర్రబడ్డ ముఖం- ఆవేళ్టి మనోరమను గుర్తు తెచ్చుకొన్నాడు.

"ఏయ్! నిన్నే ఇటు రా!" కాంటీన్ గేటులో నిలబడ్డ పోలీసు సలీం వైపు వేలు చూపి పిలిచాడు. "మైగాడ్!" కొద్దిగా కంగారుపడి లేచి నిలబడింది మనోరమ. "నువ్వు కాదు! అతనొక్కడే" మనోరమ ముఖం పాలిపోయింది. సలీంను బయటకు నడిపించుకు వెళ్ళాడు.

దాదాపు అయిదు నిముషాలు గడిచాయి. బయట ఏం జరుగుతుందో తెలియటం లేదు మనోరమకు. ధన్‌మంటూ నేలపై పడ్డ చప్పుడు. సన్నటి మూలుగూ వినబడ్డాయి.

లేచి కంగారుగా బయటకు నడిచింది. వాకిట్లో నిలబడ్డ పోలీసు ఆమెను అడ్డు కొన్నాడు. వరండాలో మఫ్టీలో ఉన్న అధికారి. ఎదురుగా సలీం. ముఖం నిండా రక్తం. ముక్కు నుంచి ఇంకా రక్తం కారుతోంది. "ఐ యామ్ ఎ జర్నలిస్ట్!" సలీం గొంతులో దు:ఖపు జీర. ఈడ్చి సలీం ముఖంపై కొట్టాడు అధికారి. "యూనివర్శిటీలో నీకేం పని. నిజం చెప్పు."

"నాకోసం, నా కోసం వచ్చాడు," భయంతో అరిచింది మనోరమ. మనోరమ వైపు దీక్షగా చూశాడా అధికారి. సలీం సంచీ లోపలి కాగితాలు, డైరీలు, కవితా సంపుటాలు అన్నీ నేలపై పడున్నాయి. కాగితాలు గాలికి ఎగురుతున్నాయి. కొన్ని కాగితాల్లో అతను రాసుకొన్న కవితలు, వాటిని శ్రద్ధగా చదివాడా అధికారి. అర్థమయినట్లు లేదు. అన్నిటినీ ఒక కర్చీఫ్‌లో మూటకట్టాడో పోలీసు. "స్టేషన్‌కు వచ్చి నీ వివరాలు, నీ అడ్రసు, స్టేట్ మెంటు ఇచ్చి వెళ్ళు," అంటూ జీపువైపు కదిలాడా అధికారి. చాలాసేపటి నుంచి ఈ ప్రహసనమంతా చూస్తున్న ముసలి ప్రొఫెసరు, "ఇదంతా ఏమిటి? ఎవరతను? ఎందుకు టార్చర్ చేస్తున్నారు?" కొంచెం కోపంగానే అడిగాడు.

"వేరీజ్ టార్చర్! జస్ట్ ఎంక్వైరీ చేస్తున్నాం!"

అధికారి వెళ్ళిపోయాడు. వెంటనే పోలీసులు కూడా.

సలీం భుజంపైన చెయ్యి వేసి, వెచ్చని చేతి స్పర్శ అతనికి తెలుస్తుంది. "నేనింక వెళ్తాను," అంది, దిగులుగా. కాసేపు ఉండమని అడగాలనిపించింది సలీంకి. అయిష్టం గానే "సరే," అన్నాడు. ఇద్దరూ రెండు మార్గాలవైపు నడిచారు. చాలాసార్లు వెనక్కు తిరిగి చూస్తూ నడిచింది మనోరమ.

సన్నగా, తుంపరగా పడుతున్న వాన ఒక్కసారిగా పెద్దదైంది. చెట్టు కిందకో, పక్కనున్న బిల్డింగ్ వైపుకో వెళ్ళడానికి ప్రయత్నించలేదు సలీం. రోడ్డుపై నీళ్ళు కాలువలాగా పారటం మొదలుపెట్టాయి. ఆకులు, సిగరెట్టు డబ్బాలు, కాగితాలు నీళ్ళలో తేలుతూ- సలీం కాళ్ళ చుట్టూ మూగాయి. రోడ్డంతా ఖాళీగా ఉంది. సలీం కే చప్పుళ్ళూ వినబడటం లేదు. ఒక్కడే వానలో ఈదుకొంటూ-

*

రెండు వారాలుగా కురుస్తున్న వాన. యూనివర్శిటీ అంతా తడితడిగా ఉంది. వర్షంలో నానిపోయి- రోడ్ల నిండా రాలిన ఆకులు గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి. ఆగస్టు నెలే కాని చలికాలం అప్పుడే వచ్చినట్లుగా అనిపిస్తుంది. కాంటీన్ ముందు తడిసిన ప్లాస్టిక్ కుర్చీలు, మనుషులెవరూ లేరు. గోడలన్నీ తడిసిపోయి ముక్కవాసన వేస్తుంది. టీ తెచ్చుకొని బయట నిలబడ్డాడు సలీం. తడిసిన రోడ్లు, సన్నగా రాలుతున్న వానతుంపర, అతనికి మనోరమను చూస్తే బాగుండనిపించింది. హాస్టల్ దగ్గర స్లిప్ ఇచ్చి వచ్చాడు.

పోయిన వారం వాళ్ళిద్దరు సినిమాకు వెళ్ళారు. గంట ముందే థియేటర్ దగ్గరకు వచ్చాడు. అంతగా హిట్ కాని ఇంగ్లీషు సినిమా. సినిమా మొదలైందిగానీ మనోరమ రాలేదు. లోపలి నుంచి పెద్దగ అరుస్తున్న, పోట్లాడుకొంటున్న, గాఢంగా ముద్దు పెట్టు కొంటున్న చప్పుడు. ఆకుపచ్చ రెయిన్‌కోట్ తగిలించుకొని మార్లిన్‌మన్రోలాగా ఆటో దిగింది. మౌనంగా లోపలికి నడిచింది. సీట్లో కూర్చున్నాక క్రమంగా సినిమా తాలూకు రంగుల మాయలోకి వెళ్ళిపోయింది. మధ్యలో ఆమె చెవి దగ్గర సన్నగా గొణగడానికి ప్రయత్నించాడు సలీం. "మూవీ ఇంట్రెస్టింగ్‌గా ఉంది," అంది విసుగ్గా. అదేం పట్టించు కోకుండా, మెల్లగా ఆమె భుజంపై చెయ్యి వేసి-

కాంటీన్ ఎదురు రోడ్డుపై నుంచి ఆకుల్ని తొక్కుకొంటూ- మనోరమ అను కొన్నాడు. కాదు, ఎవరో కుర్రాడు. తెలిసిన ముఖమే. ముఖంపైన వానచినుకుల్ని తుడుచుకొని, టీ తెచ్చుకొని సలీం దగ్గరకు వచ్చి, "హలో" అన్నాడు. యూనివర్శిటీలో రీసెర్చి చేస్తున్నాడు. పి.యస్. అనే పేరుతో కవితలు రాస్తుంటాడు.

సాయంకాలం అయిదు కావస్తుంది. మసగ్గా, చీకటిగా ఉంది. కాంటీన్ చివర్లో కిటికీకి ఆనుకొని కాంటీన్ వర్కరొకడు బీడీ లాగిస్తున్నాడు. గట్టిగా దమ్ము పీల్చినపుడు, వాడి ముఖం ఎర్రగా వెలిగిపోతోంది.

"బోర్‌గా ఉంది కదూ'," అన్నాడు పి.యస్. సలీం నుద్దేశించి. "ఈ వాతావరణమే అంత- వంటరితనం మీద రాసిన లాంగ్ పోయమ్‌లా," అని క్షణంసేపు ఆగి, "ఎవరికోస మైనా ఎదురుచూస్తున్నారా?" అన్నాడు పి.యస్. మళ్ళీ, "గర్ల్‌ఫ్రెండా?" అన్నాడు పొగను సలీం ముఖంలోకి ఊదుతూ. "వాన చినుకులు, వేడి టీ, పక్కన మనోరమ ఉంటే చాలా బాగుంటుంది కదూ," ఉలిక్కిపడ్డాడు సలీం. అతన్ని పట్టించుకోవటం మాని, అటు తిరిగి గంభీరంగా నిలబడ్డ చెట్లవైపు చూపు తిప్పాడు. సన్నటి తెరలాగా వాన నలువైపుల నుంచి కమ్ముకొంది.

సినిమాహాల్లో మనోరమ భుజంపై వాలిపోయి- వెచ్చని ఆమె ఊపిరులు చెవులకు తగులుతుండగా- గొప్ప అనుభవం అది. మృదువైన స్పర్శ, వెచ్చటి శ్వాస, ఆ కాస్త అనుభవం అతని గుండెల్లో గాఢంగా రికార్డయింది. ఆ మొత్తం సాయంకాలానికే పరిమళం అద్దినట్లుగా ఉంది. ఆ స్పర్శ తాలూకు అనుభూతి అతన్ని వెంటాడుతోంది. వాన చినుకులు, ముసురు, దిగులులాంటి సాయంకాలం, మళ్ళీ అట్లాంటి అనుభవం ఏదైనా దొరుకుతుందేమోనని-

మెల్లగా నలుగురైదుగురు కుర్రాళ్ళు చేరేరక్కడ. సలీం చుట్టూ వలయంలా నాలుగు కుర్చీలు వేసుకొని- ముట్టడిలా తోచింది. 'మనోరమ తాలూకు' వాళ్ళ చెవుల్లో ఊదాడు పి.యస్. వింత ఆందోళన ఏదో సలీంలో పొగుపడింది. లేచి దూరంగా నడిచాడు. విసుగ్గా రోడ్డువైపు చూస్తూ. ఇంతసేపైనా రాని మనోరమని తిట్టుకొంటూ. పొడవుగా లావుగా ఉన్న కుర్రాడొకడు- సిగరెట్టునొక ఆయుధంలా- ఊదుకొంటూ సలీం వైపు నడిచాడు.

"సో, యు ఆర్ మిస్టర్ సలీం సుందర్!"

"ఏంఫీబియన్‌లా ఆ పేరేమిటి?"

"ఇంతకీ నువ్వేమిటి? నీ రూట్స్ ఏమిటి? నీ లాయల్టీస్ ఎటువైపు?"

సలీం ముఖం ఎర్రగా నిప్పులా మారిపోయింది. వానజల్లు క్రమంగా పెద్దదవు తుంది. తడుస్తూ అయినా సరే ఇక్కడ నుంచి వెళ్ళిపోవాలని కోరిక కలిగింది.

పొడవుగా లావుగా ఉన్న కుర్రవాడు, సలీం పక్కన నిలబడి, పరిశీలనగా చూడటం మొదలుపెట్టాడు. సలీం శరీరం బిగుసుకుపోయింది. ముఖంలో కోపం స్పష్టంగా తెలుస్తుంది.

"అలా చూడొద్దు అజారుద్దీన్!"

"ఇంతకీ సున్తీ అయినట్టేనా?"

"ఒరే బాబాయి! ఆ పక్కన యూనివర్శిటీ హెల్త్ సెంటర్‌కి తీసుకెళ్ళి చెక్ చేయిద్దాం రా."

దూరంగా రోడ్డుపైన అడుగుల చప్పుడు. మనోరమ. ఆకులపైన మృదువైన పాదాల చప్పుడు. కోపం కంట్రోలు చేసుకోవాలని, వాన చినుకుల మధ్య మనోరమతో కలిసి వెచ్చటి టీ తాగే ఒక కలను మళ్లీ లోపల ఇరికించుకోవాలని-

సలీం చొక్కా పట్టుకొని ముందుకు తోశాడు ఆ కుర్రాడు.

'ఫట్' మంటూ వాడి ముఖం పలిగింది. ఆపై మరింక ఆలోచించలేదు సలీం. ఒక ట్రాన్స్‌లో ఉన్నవాడిలా, యుద్ధం చేస్తున్నవాడిలా, వాడిపైనబడి- వాడి ముఖమంతా రక్తం. ఎముక కూడా విరిగినట్లుంది. "సలీం!" మనోరమ సన్నటి అరుపు. మిగిలిన కుర్ర వాళ్ళు నోళ్లు తెరుచుకొని చూస్తున్నారు. దేన్నీ పట్టించుకోలేదు సలీం. దబ్బుమంటూ నేలపై కూలాడు ఆ కుర్రాడు. ఏం చెయ్యాలో తోచక, అట్లాగే చెట్ల మధ్యలోంచి కాంపస్‌లోకి పరుగు తీశాడు సలీం. "నరకండి! తన్నండి!" వందలాది అరుపులేవో అతన్ని వెంటాడు తున్నట్లుగా ఏదో భయం. వాన చప్పుడు తెలుస్తూనే ఉంది. పల్చటి తెరలాంటి వానలో అట్లాగే పరిగెడుతున్నాడు సలీం. "సలీం! ఆగు సలీం?" మనోరమ కేకలు వేస్తూనే వుంది.

వాన చినుకుల మధ్యన, గుబురుగా ఉన్న పొదల మధ్యన అట్లాగే చాలాసేపు పరిగెత్తాడు సలీం. 'ఏం జరగబోతుందిప్పుడు?' చాలాసేపు అతని మనసులో ఒక ప్రశ్న. 'ఏంకాదు, మహా అయితే, ఇంకో నలుగురు కుర్రాళ్ళు. మరో చిన్న పోట్లాట,' ఊహు, లాజిక్‌ను అంగీకరించలేని స్థితి. భయం, అలలాగా శరీరంలోని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతంలోకి ప్రయాణిస్తూ రకరకాల భయాలు, అదృశ్యమైన దారాలుగా, క్రమంగా అల్లికలా మారి జరగబోయేది అతనికి పరిచయంలోకి వచ్చినట్లుగా నిక్కర్లు, లాఠీలు, కాషాయపు జెండాలు- భయకంపితుడయ్యాడు. భయం, చావు రంగు మాస్క్ వేసుకొని- ఊహలన్నీ మెదడులోంచి విడివడి- ఎగురుకొంటూ కళ్ళ ముందటే నిలిచి- సలీం, సలీం- పొడవాటి యూకలిప్టస్ చెట్ల మధ్యన సలీం మరణభయంతో పరిగెడుతున్నాడు. యూని వర్శిటీ కాంపస్ చివరకు వచ్చాడు. అమెరికన్ లైబ్రరీ ఎదుట క్షణంపాటు నిలబడ్డాడు. ఎదురుగా విశాలమైన రోడ్డు. చెట్ల కింద క్రికెట్ ఆడే కుర్రాళ్ళు. బలంగా, నిర్భయంగా, యవ్వనహాసాలతో కబుర్లు, జోకులు. వాన ఆగిపోవటం కోసం ఎదురుచూస్తున్నారు. వికెట్లు, బాట్లు నిస్సహాయంగా వానలో తడుస్తున్నాయి. సలీంకో వింత ఆలోచన వచ్చింది. అది పరమ అవాస్తవికంగా, అబ్సర్డ్‌గా అనిపించింది. కానీ ఎందుకో, ఆ ఆలోచన ప్రాణవాయువులా గాఢంగా, బలంగా అతని మెదడునంతా ఆక్రమించింది. నాన్సెన్స్, నాన్సెన్స్ అని రెండుసార్లు గొణుక్కున్నాడు. ఊహు కాదు కాదు ఇదే కరెక్టని మనసుకు నచ్చజెప్పుకున్నాడు. పదపద ఇదో గొప్ప ఎస్కేప్ అనుకొన్నాడు.

ఆ కుర్రవాళ్ళ దగ్గరకు వెళ్ళి సీరియస్‌గా వాళ్ళ ముఖాల్లోకి చూసి, "హలో," అన్నాడు.

"హలో అంకుల్!" అన్నారు వాళ్ళు కోరస్‌గా.

ముఖాన్ని గంభీరంగా మార్చి, "నాకో సాయం కావాలి," అని క్షణం ఆగి, "సిక్సర్ కొట్టినంత వేగంగా, బలంగా- నా ముఖంపై గుద్దాలి. ముక్కు పగిలిపోయి, మూతి వంకర తిరిగి." 'జోక్ వేస్తున్నావా?' అన్నట్లుగా చూశారు వాళ్ళు, "యాభై రూపాయలిస్తాను," అన్నాడు. "వింతగా, ఆశ్చర్యంగా ఉంది కదూ, పోనీ వంద యిస్తాను," అన్నాడు.

"మీరే కొట్టుకోవచ్చుగా'," అన్నాడో కుర్రాడు.

"కొట్టుకోవచ్చుగానీ, అంత బలంగా కొట్టుకోలేను" అని, "పోనీ రెండు వంద లిస్తాను!" అన్నాడు. జేబులోంచి రెండు వందనోట్లు బయటకు తీశాడు.

వాళ్ళలోంచి ఒకడు, అప్పటికీ నమ్మకశ్యం కాని ముఖంతో ముందుకు వచ్చి, నోట్లు తీసుకొని, కాసేపు తటపటాయించి, చేతిని బిగించి, పిడికిలిని గట్టిగా ఉక్కులా మార్చి- కళ్ళు మూసుకొన్నాడు సలీం. గొప్ప చప్పుడుతో ముఖాన్ని పగలగొట్టిందా పిడికిలి. నొప్పి కాదు. మరింకేదో, చెట్టు సమూలంగా పెకలించి వేయబడ్డట్టుగా, ముక్కులోంచి బుడబుడ రక్తం, ముందున్న రెండు పళ్ళూ ఊడి- క్షణంసేపు శరీరం అదుపు తప్పి- ఒక చెట్టుకు ఊతంగా ఆనుకొని- థాంక్స్ అంటూ, ముందున్న చెట్ల పొదల్లోకి పరిగెత్తాడు. కలను అనుభవిస్తున్న వాళ్ళలా ఆ కుర్రవాళ్ళ ముఖాలు.

ఆరోజు సాయంకాలమే సలీం సెలూన్‌కి వెళ్ళి, హెయిర్ స్టయిల్ మార్పించు కొన్నాడు. మీసాలు తీసివేశాడు. కొద్దిగా వంకరబోయిన ముక్కు, తొర్రిపన్ను- కొత్త మనిషిలా ఉన్నాడు. 'ఇదంతా అవసరమా?' అని, ఆ రాత్రి చాలాసేపు తర్కించుకొన్నాడు. 'ఇదో తెలివితక్కువ ప్రహసనంలా ఉంది,' అని పదేపదే గొణుక్కున్నాడు.

చాలారోజుల తర్వాత అతనికి మజీద్‌కు వెళ్లాలనిపించింది. చిత్రంగా ఆరెండు రోజుల పాటు అతనికి మనోరమ గుర్తుకురాలేదు. యూనివర్సిటీ, ఆ ప్రాంతం అదంతా శత్రుశిబిరంలా తోచింది. లాఠీలతో తన కోసం రోడ్డుపైన ఇంకా వెతుకుతున్నట్లుగానే అనిపించసాగింది.

రెండు వారాలు గడిచిపోయాయి. ఉదయాన్నే పత్రికాఫీసు నుంచి కబురు వచ్చింది. ధర్నా, ఊరేగింపు- రావాల్సిన బకాయిల కోసం. సలీంకు ఆఫీసు గుర్తుకు వచ్చింది. కాగితాల వింత వాసన గుర్తుకొచ్చింది. తను రాసిన వార్తలు, వాటి మధ్య తను పొదిగిన అందమైన పదాలు- శరీరానికి అంటుకొన్న పరిమళంలా ఆ వార్తలు- తనదైన గొప్ప సంపద ఏదో దోచుకోబడ్డట్టుగా-

వందమందికి పైగా ఉన్నారు. సలీం రూపం వింతగా ఉంది. అయితే అది నిరసన వాతావరణం కాబట్టి ఎవరూ అతనిలోని మార్పును పెద్దగా పట్టించుకోలేదు. ఉమారావు

అనే మిత్రుడు మాత్రం ప్రేమగా భుజంపై చెయ్యివేసి, "ఏమైంది సలీం! ఎనీ ప్రాబ్లెం?" అన్నాడు. సలీంకి దుఃఖం రాబోయి, పెద్ద పెట్టున ఏడవబోయి, "ఏమీలేదు... ఏమీ లేదు," అని రెండుసార్లు గొణిగాడు. రోడ్డుపైన కూలబడ్డారందరూ.

మధ్యాహ్నం నాలుగు గంటల సమయంలో, ఎక్కడ నుంచో ఎగురుకొంటూ వచ్చిన మాయపక్షిలా మనోరమ పక్కన వచ్చి కూలబడింది. పెదాలపై సన్నని నవ్వు. ఆమె రాక అనీజీగా అనిపించింది సలీంకి. అటు వెళ్ళి టీ తాగి వద్దాం అని గొణిగింది. లేచి, ముందుకు చౌరస్తా వైపు నడిచాడు.

"ఈ ధర్నాలు, ఇవీ ఇకచాలు, ఎటైనా పోదాం!" అంది. యూనివర్శిటీలోని సంఘటన గురించి ఏమీ మాట్లాడకపోవటం ఆశ్చర్యంగా ఉంది సలీంకి. తననంతగా కలవరపరచిన సంగతి, భయపెట్టిన సంగతి- "అవును ఆరోజు నీకూ, పి.యస్.కూ ఏదో గొడవయ్యిందటగా. ఎమ్మెస్సార్‌ని నువ్వు పట్‌పట్‌మనిపిస్తున్నప్పుడు వచ్చాను. ఏం జరుగుతుందోనని భయపడ్డాను," టీ తాగుతూ అంది. సలీంకి ఊపిరి ఆగిపోయినట్లుగా. "ఎమ్మెస్సార్ వారం రోజుల పాటు క్లాస్‌కు రాలేదు. గొప్ప షాక్ వాడికి- అవును, ఏమిటీ గెటప్, బ్రూస్ విల్లీస్‌లా."

"అట్లా నెక్లెస్ రోడ్డు వైపు వెళ్దాం పద," అంటూ లేవదీసింది. నెక్లెస్ రోడ్డు సందడిగా ఉంది. మనుషులు కనబడని ఒక మూలకు తీసుకెళ్ళింది. సినిమా హాలు, వెచ్చని స్పర్శ గుర్తుకొచ్చాయి సలీంకి- దిగులునంతా దులిపేసి కొత్త ఉత్సాహాన్ని రగిలించుకొన్నాడు.

ఎవరూ కనబడని ఏకాంతంలో మనోరమని ముద్దు పెట్టుకున్నాడు సలీం. మృదువుగా, మెత్తగా, నిజంగా, మరణంలాగా, పుట్టుకలాగా, కలలాగా- మనోరమ ముఖం పై సన్నని నవ్వు. బహుశా ఏ దుఃఖాలూ అంటని ఒక స్థితిలో.

మనుషుల సందడి పెరిగి నెక్లెస్‌రోడ్డు చిన్న సైజు సంతలాగా మారింది. కారు శబ్దాలు, మనుషుల అరుపులు- ఆ మూల చీకటిలో వాళ్లిద్దరూ ఒకే మనిషిలా, రెండు నేనులు ఒక నేనుగా, గాఢమైన స్పందనలా, సాంద్రమైన కవిత్వంగా మారిపోయారు.

సెప్టెంబరు పదహారున పోలీసుస్టేషన్‌కు రావలసిందిగా సలీంకు కబురుచేశారు. రాష్ట్రంలో చాలాచోట్ల బాంబులు పేలిన నేపథ్యంలో సలీంను ఇంటరాగేట్ చేయాల్సిన అవసరం ఉందట.

స్టేషన్‌కు వెళ్ళేముందు రాత్రి యుద్ధాన్ని కలగన్నాడు సలీం. స్టెన్‌గన్లు, గ్రైనేడ్లు- యుద్ధం మధ్యలో సలీం క్షతగాత్రుడిలా- స్ట్రెచర్ మీద అతని శరీరాన్ని మోసుకెళుతూ- అతని రెండు పెదాలూ తెగిపడి ఉన్నాయి.

పెదవులు లేని ముఖంతో అతను యుద్ధరంగం నుంచి వస్తున్నాడు. మనోరమ రెండు చేతుల్తో అతని ముఖాన్ని దగ్గరకు తీసుకొని- ముద్దు పెట్టుకోబోయి కెవ్వున అరిచింది. మెలుకువ వచ్చిన తరువాత కూడా సలీంని ఆ అరుపు వెంటాడుతూనే వుంది.

స్టేషన్‌లో చాలామంది కుర్రాళ్ళు. దు:ఖంతో, భయంతో పాలిపోయిన ముఖాలతో. ఎవ్వరూ పెద్దగా మాట్లాడుకోలేదు. స్టేషన్ బయట వాళ్ళ తల్లులు, తండ్రులు- తల్లుల శోకం వినిపిస్తూనే ఉంది.

సలీంకి అమ్మీ గుర్తుకొచ్చింది. ఏ అనుభూతులూ అంటని ఏమ్నీసియాలోకి వెళ్ళిపోయి- దు:ఖం, సంతోషం ఏ తడీ అమ్మీని అంటదు. అమ్మీకిది నిజంగా వరమే. అమ్మీకి ఇక సలీం గురించిన జ్ఞాపకమే ఉండదు.

ఒక పగలు, రెండు రాత్రులు గడిచాయి. సలీంకి నిద్రలో యుద్ధం గురించిన కలలే వచ్చాయి. కల పొడవునా తెగిపోయిన అవయవాలు.

రెండోరోజు ఉదయం అతని కోసం జె.బి.రెడ్డి అనే కుర్రాడు వచ్చాడు. నాలుగు రొట్టెలు కుర్మా పొట్లాం తెచ్చాడు. ఈ రెడ్డి కథలు రాస్తూ ఉంటాడు. రెండు మూడు మీటింగ్‌లలో కలిశాడు. సలీం అరెస్టును ఖండిస్తూ చాలామంది కవులు, రచయితలు సంతకాలు పెట్టి మెమోరాండాన్ని కలెక్టరుకు ఇచ్చారట. పేపర్లలో కూడా స్టేట్‌మెంట్ ఇచ్చారట. బహుశా సాయంత్రమో, రేపో వదిలి పెట్టొచ్చు అంటూ చెప్పాడు.

ఆ రాత్రి కూడా సలీం యుద్ధాన్ని గూర్చి కలగన్నాడు. అయితే యుద్ధం మధ్యలో మనోరమ కన్పించింది. అతని కోసం ఆహారాన్ని, మందుల్ని తెస్తూ, రెడ్‌క్రాస్ వాళ్ళ నర్సు రూపంలో ఉంది. తెగిపోయిన సలీం పెదాల్ని చేతితో నిమిరి పెద్దగా ఏడ్చింది. "ఈ పెదాలు లేని ముఖాన్ని ఏం చేసుకోను? కనీసం పెదాలుండి నువ్వు చచ్చిపోయినా బాగుండేది. శవంతోనైనా సహజీవనం చేద్దును," అని పెద్దపెట్టున ఏడుస్తోంది.

"యుద్ధం. బాగా అలిసిపోయాను. దగ్గరకు తీసుకోవా?" అని సలీం అర్థిస్తున్నాడు.

"పెదాలు తెగిపోయిన ముఖాన్ని ఎట్లా దగ్గరకు తీసుకోను," వెళ్ళడానికి సిద్ధమైంది మనోరమ.

"వెళ్ళేముందు ఒక ముద్దు పెట్టవా?" సలీం దీనంగా బతిమాలుతున్నాడు. గట్టిగా కళ్ళు మూసుకొని, అయిష్టంగా, అతని ముఖంపై, పెదాలు బదులు చిగుళ్ళు, దంతాలు ఉన్న ప్రదేశంలో అంటీ అంటని ముద్దు పెట్టుకొని వెళ్ళిపోయింది మనోరమ. చిత్రం, ఆమె ముద్దు పెట్టుకొన్నచోట పువ్వులు మొలవటం - యుద్ధరంగమంతా పరిమళభరితం కావటం సలీంకు తెలుస్తూనే ఉంది.

ముఖంపై పువ్వులు మొలిచిన కలగన్న ఆరుగంటల తరువాత సలీంను స్టేషన్ నుంచి వదిలివేశారు.

*

"మనల్ని మేలుకొలిపే స్వప్నాలు లేవు!" గట్టిగా గొణుక్కొన్నాడు సలీం సుందర్. అట్లా గొణుక్కొంటూ పెద్దగా అనేశాడు. "స్వప్నాల మరణమే మనల్ని మేలుకొలుపు

తుంది," అని. వింటున్నట్టుగా, విననట్టుగా కూర్చుంది మనోరమ. జైలు నుంచి వచ్చిన వారం తరువాత సెలయేరు, చుట్టూ కొండలు, ఒంటరి సాయంకాలం ప్రేమికులకు అనువైన ప్రతీకలే అన్నీ. వాళ్ళిద్దరు మాత్రం కవిత్వపు జల ఆగిపోయిన ఇద్దరు ముసలి కవుల్లా- "ఈ జైళ్ళు, ఈ యుద్ధపు కలలు, ఏమిటిదంతా?" దిగులుగా అడిగింది మనోరమ. సలీం మాట్లాడలేదు.

"నేనో సలహా చెప్పనా? సలీంసుందర్‌ని, ఎస్.సుందర్‌గానో, లేదా ఒట్టి సుందర్ గానో, పోనీ మోహనసుందరంగానో మార్చేద్దామా?" అంది మనోరమ.

ఉలిక్కిపడ్డాడు సలీం. కొంచెం అర్థమయ్యీ , కొంచెం అర్థంకాక - కొంచెం భయం, కొంచెం దిగులు, కొంచెం ఆందోళన సలీంసుందర్‌లో.

"ఈ హింసకు, ఈ దు:ఖానికి అదే సమాధానం. పేరే కదా"

'గాడ్ మనోరమ. ఈ మనోరమేనా?' సలీం గొణుక్కొన్నాడు.

మనోరమ సలీంకు దగ్గరగా జరిగి, సలీం ముఖాన్ని దగ్గరకు తీసుకొని, యుద్ధ రంగం, తెగిన పెదాలు కళ్ళ ముందు మెదిలాయి సలీంకు. సలీం ముఖాన్ని దగ్గరకు తీసుకొని, రొమ్ములకు హత్తుకొని "నా మాట విను. నువ్వు ముస్లింవో, నేను హిందువునో కాకపోతే ఏమిటి నష్టం," మనోరమ మాట్లాడుతూనే ఉంది. సలీంకేమీ వినబడటం లేదు. తగలబడుతున్న గృహాలు, గాయపడ్డ శరీరాలు, జ్ఞాపకాలు జ్ఞాపకాలుగా విడిపోయి ఒట్టి కండరాల పోగుగా మిగిలిన అమ్మీ- కళ్ళ ముందు మెదిలారు.

వెచ్చని గాఢమైన, మధురమైన మనోరమ శ్వాస అతని శరీరం అంతా ప్రసరిస్తుంది. సలీం ముఖంలో దిగులు, విరక్తి. 'మోహనసుందర్, మోహనసుందర్, మోహనసుందర్,' అని ముమ్మారు గొణుక్కొన్నాడు.

మనోరమ శరీరం, అతని శరీరాన్ని తాకగానే అతనిలో కామోద్దీపనకు బదులు, ఒక విధ్వంసం, ఒక ప్రాణభయం, ఒక జ్ఞాపకాల మరణం ముసురుకొన్నాయి. అతని చెయ్యి, ఆమె వక్షంపైకి పాకినప్పుడు అతని చెయ్యి, రక్తమాంసాల చెయ్యిలా కాకుండా, ఒక లోహపు వస్తువులా ఉండటం అతనికి తెలుస్తోంది. అవును, అతనికి తెలుస్తోంది. అతని శరీరం ఒక ఆయుధంలా మారుతున్న సంగతి. అయితే మార్పులన్నీ మెదడులోకి చేరకుండా ఏదో ఆనకట్ట. ఏ ఉద్వేగమూ అతని ఆధీనంలో లేదు. అతనొక కొత్త మనిషి.

దాడిలో గాయపడ్డ దానిలా కెవ్వున అరిచింది మనోరమ వద్దు వద్దు అంటూ. సలీం కేమీ వినిపించటం లేదు. అతని శరీరం ఆయుధమయి, ఆమె శరీరాన్ని చీల్చి- ఆ రక్తం చూస్తూ అతను సేదదీరటం అతనికి తెలుస్తోంది. భయంకరమైన బాధతో ఆమె రెండు కాళ్ళు దగ్గరకు జరుపుకొని రోదించటం అతనికి అర్థమవుతోంది. కానీ స్పందనలు చచ్చిపోయినవాడిలా అట్లా చూస్తూ ఉండిపోయాడు.

*ఆదివారం వార్త, 11 నవంబరు 2001*